హద్దులు ఏర్పాటు చేయాలి

జన్నారం, జూన్ 3: కలమడుగు, మురిమడుగు గ్రామ శివారులో గల నాయకపుగూడం, మొర్రిగూడం గ్రామాలకు వెళ్లే ఎడ్లబండ్ల దారిని కొందరు కబ్జా చేస్తున్నారని, హద్దులు ఏర్పాటు చేసి దారి ఏర్పాటు చేయాలని రైతులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎడ్లబండ్లు వెళ్లడానికి ఉన్న దారిని లేకుండా చేశారన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. రైతులు శంకరయ్య, రాజన్న, సోనియా, విజయరావు, అన్నపూర్ణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడెం ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

దండేపల్లి,జూన్ 3: గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం హుండీలను లెక్కించారు. 59 రోజులకు సంబంధించి రూ.5,89,486 ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్, ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, వేదపండితులు దుద్దిళ్ల నారాయణశర్మ, సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

నస్పూర్, జూన్ 3: సీసీసీ కార్నర్ వద్ద గల సృష్టి ఇనిస్టిట్యూట్‌లో సోమవారం బేటీ బచావో, బేటీ పడావో లింగ నిర్ధారణ, బాల్యవివాహాలు నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్, పోక్సో యాక్ట్, సైబర్ క్రైం, సఖీ సర్వీసెస్, మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక విద్యార్థులకు అవగాహన కల్పించారు. సృష్టి ఇనిస్టిట్యూట్ కరస్పాడెంట్ అంబాల రాజ్ కుమార్, సిబ్బంది లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశాలకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి

నస్పూర్, జూన్ 3: ఆశా వర్కర్లకు పరీక్షలు పెట్టె విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ చాలా కాలంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు, గర్భిణీలకు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ గుర్తింపు లేకపోగా ఆశాలకు పరీక్షలు పెట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, కార్యదర్శి శోభ, సభ్యులు విజయలక్ష్మి, పద్మ, విజయ, కవిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ఏసీసీ, జూన్ 3: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఫస్ట్ లాంగ్వేజ్ రెండు పరీక్ష కేంద్రాల్లో 334 మంది విద్యార్థులకు 298 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ దామోదర్‌రావులు పరిశీలించారు.

భవనాల నిర్మాణాలకు అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 3: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, మార్క్స్ భవన్, రాజీవ్‌నగర్, తిలక్‌నగర్ బస్తీల్లోని పార్టీ భవనాల నిర్మాణాలకు ప్రజలు, వ్యాపారులు, బస్తీవాసులు, కాంట్రాక్టర్లు, అధికారులు సహకరించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ప్రజలు, విద్యార్థులు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశామన్నారు. ప్రస్తుత పార్టీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అందరికి అందుబాటులో ఉండేలా కార్యాలయాలు నిర్మించడానికి పూనుకున్నామని, ఇందుకు ఆర్థికంగా, వస్తురూపేణా సహాయ సహకారాలు అందించాలన్నారు. చాంద్‌పాషా, బ్రహ్మానందం, శ్రీనివాస్, మల్లన్న, జ్యోతి, శ్రీకాంత్, అరుణ్, సాజిద్, సాంబన్న, పాల్గొన్నారు.


'సముద్రమంతా మనుషులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న రచయిత అల్లం రాజయ్య, తదితరులు

మందమర్రిటౌన్, జూన్ 3: పీడిత ప్రజల హక్కుల కోసం, రాజ్యహింసకు వ్యతిరేకంగా ఎంతో మంది తల్లులు తనయులను త్యాగం చేశారని, వారి త్యాగం గొప్పదని రచయిత, కవి, విరసం సభ్యుడు అల్లం రాజయ్య అన్నారు. సోమవారం సీఈఆర్ క్లబ్‌లో సముద్రమంతా మనుషులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కోల్‌బెల్ట్‌లో చాలా మంది తల్లులు వారి బిడ్డలను ఉద్యమానికి అంకితం చేశారని, పోరాటంలో అమరులైన పుత్రులను తలుచుకుంటూ మరణించే వరకు వారి జ్ఞాపకాలతో కాలం వెళ్లదీశారన్నారు. సోదరుడు సత్యం విప్లవోద్యమంలో అమరుడైతే అతనితో ఉన్న అనుబంధం, తల్లిదండ్రులతో ఉన్న జ్ఞాపకాలను పుస్తక రూపంలో రచయిత రవీందర్ తీసుకురావడం మంచి పరిణామమన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరావు, బంధుమిత్రుల కమిటీ అధ్యక్షురాలు పద్మకుమారి, సికాస వ్యవస్థాపకుడు హుస్సేన్, మేరుగు ఈశ్వరమ్మ, చిలుక బూద మ్మ, విజయ, గురిజాల రవీందర్‌రావు, సుందిల్ల రాజయ్య, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై విచారణ




ఎస్‌ఈతో మాట్లాడుతున్న నాయకులు

జన్నారం, జూన్ 3: మండలంలో కరెంటు కోతలు అధికంగా ఉన్నాయని ఏఈ, లైన్‌ఇన్‌స్పెక్టర్లు ఉండడం లేదని సీఎండీ వరుణ్‌రెడ్డికి నాయకులు ఫిర్యాదుచేశారు. విద్యుత్ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నాయకులను వివరాలు తెలుసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు మాట్లాడుతూ కొన్ని రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏఈ, ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్‌ఈ తెలిపారు. నాయకులు శంకరయ్య, సుభాష్‌రెడ్డి, రాజన్న, సుధీర్ పాల్గొన్నారు.

కౌంట్ డౌన్





- కొన్ని గంటల్లో పార్లమెంటు ఎన్నికల ఫలితాలు
- కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

మంచిర్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల కౌంట్ డౌన్ మొదలైంది. మరికొద్ది గంటల్లో ఫలితాలు వెలువడనున్నాయి. ఎలక్షన్ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో మే 13న లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల కౌంటింగ్ సెంటినగర్‌కాలనీ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ హాజీపూర్ మండలం ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుంది. మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, స్ట్రాంగ్ రూంలో ఉన్న ఈవీఎంలను అభ్యర్థులు, అధికారుల సమక్షంలో తెరవనున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎన్ని కల కౌంటింగ్ పరిశీలకులు విజయఈరవికుమార్, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ అశోక్‌కుమార్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాహుల్, డి చంద్రకళ, వాడాల రాములు, పర్యవేక్షణలో లెక్కింపు జరుగనుంది.

తేలనున్న అభ్యర్థుల భవితవ్యం...

మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా వివిధ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జిల్లాలోని మూడు నియోజక వర్గాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీ అ భ్యర్థి గడ్డం వంశీకృష్ణ గె లుపుపై ధీమాతో ఉన్నారు. బీ ఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు కొ ప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గొమాసె తమదైన శైలిలో లెక్కలు వేస్తూ తామే గెలుస్తామనే విశ్వాసంతో ఉన్నారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మొత్తం 42 మంది నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది.

ఎగ్జిట్ పోల్ సర్వేలపై ఆసక్తి

కొద్ది గంటల్లో ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల నాయకులు ఎగ్జిట్ పోల్ సర్వేల ఆసక్తితో ఉన్నారు. దేశవ్యాప్తంగా పలు మీడియా, సర్వే సంస్థలు రాష్ట్రంలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ నువ్వా..నేనా అన్నట్లు ఉంటుందని ఫలితాలు వెల్లడిస్తుండటంతో ఆ పార్టీల నాయకులు తీవ్ర ఉత్కంఠతకు గురవుతున్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో దాదాపుగా అన్ని సర్వేలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతుండటంతో హస్తం పార్టీ అభ్యర్థి జెండా ఎగురవేస్తారని భావిస్తున్నారు. దీంతో ఇతర పార్టీ నాయకులు ఒకింత ఆందోళనకు గురవుతుండగా, ఎవరికి వారే ఫలితాలు తమకే అనుకూలిస్తాయనే అంచనాలో ఉన్నారు.

కౌంటింగ్‌కు మూడంచెల భద్రత...

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు రోజున పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్, హైవే భద్రతతోపాటు కౌంటింగ్ హాలు వద్ద సీఆర్‌పీఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వు, లోకల్ పోలీసుల ఆధ్వర్యంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. రామగుండం సీపీ పర్యవేక్షణలో డీసీపీ అశోక్ కుమార్ నేతృత్వంలో ఐదుగురు ఏసీపీ ర్యాంకు అధికారుల పర్య వేక్షణలో భద్రతా ఏర్పాట్లు జరు గుతున్నాయి. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించనున్నారు. మంగళవారం ఉద యం 6 నుంచి 24 గంటలపాటు 144 సెక్షన్ అమలులో ఉండనుంది. పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ వేళ విజయోత్సవ ర్యాలీలకు పోలీస్‌శాఖ అనుమతి నిరాకరించింది. పోలీస్ శాఖ ఆంక్షల నేపథ్యంలో ఎలాంటి ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతి లేదు.

మద్యం దుకాణాలు బంద్

ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో మంగళవారం మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఉదయం 6 గంటల నుంచి బుధ వారం ఉద యం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి వేయాలని పోలీస్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. బార్లు, రెస్టారెంట్లు, వైన్ షాపులను నిర్ణీత సమయం మేరకు మూసి ఉంచాలని స్పష్టం చేసింది.

- పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,96,430 ఓట్లకుగాను 10,83,453 ఓట్లు 67.87 శాతం పోలయ్యాయి. ఇందులో పురుషులు 7,87,705 మందికిగాను, 5,40,774 మంది, మహిళలు 8,08,622 మందికిగాను 5,42,646, మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఇతరుల్లో 130 మందికి గాను 33 మంది ఓట్లు వేశారు.

కౌంటింగ్‌కు సిద్ధం

మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల ఓట్లకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాన్ని హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. కళాశాల గ్రౌండ్ ఫ్లోర్‌లో చెన్నూరు నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, బెల్లంపల్లి నియోజకవర్గానికి మొదటి అంతస్తు, మంచిర్యాల నియో జకవర్గానికి రెండో అంతస్తులో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగనుండగా, అనంతరం ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జిల్లాలోని మూడు నియోజక వర్గాల్లో 741 పోలింగ్ కేంద్రాలకుగాను మంచిర్యాల పరిధిలో 21 రౌండ్లు కౌంటింగ్ జరుగనుండగా, చెన్నూరు, బెల్లంపల్లి పరిధిలో 17 రౌండ్ల చొప్పున లెక్కింపు చేపట్టనున్నారు.ఒక్కో సెగ్మెంట్‌కు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాట్లు చేశారు.



ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి

ఏసీసీ, జూన్ 3: ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణాధ్యక్షుడు తూముల నరేష్‌లతో కలిసి మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు గడప రాకేష్‌పై జరిగిన దాడితో ఏ పార్టీకి సంబంధం లేదన్నారు. ఓడిపోయాననే బాధ, అక్కసుతో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కావాలనే ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుపై బురద జల్లుతున్నాడన్నారు. మంచిర్యాలలో శాంతియుత వాతావరణం పాడయ్యేలా దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావు వ్యవహరిస్తున్నారన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు దివాకర్‌రావు తనయుడు విజిత్‌రావు గడప రాకేష్ ఆధ్వర్యంలో గుండాలను పెంచి పోషించారన్నారు. గతంలో రాకేష్ ఒక హోటల్‌పై దాడి చేసినప్పుడు దివాకర్‌రావు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. రాకేష్‌పై జరిగిన దాడి రెండు గ్రూపుల మధ్య జరిగిన గొడవ అని, పాత కక్షలను



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

దృష్టిలో ఉంచుకుని జరిగిందన్నారు. దాడికి పాల్పడిన వారు కాంగ్రెస్ కార్యకర్తలు కాదని, పార్టీ సంబంధం లేదన్నారు. ఎన్నికల సమయంలో రాకేష్‌ను ప్రేంసాగర్‌రావు రాజకీయంగా విమర్శించాడే తప్ప వ్యక్తిగతంగా విమర్శించలేదన్నారు. రాకేష్ మీద ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ నాయకులకు వ్యక్తిగతంగా ఎలాంటి విబేధాలు లేవని, దాడిని తాము కూడా ఖండిస్తున్నామన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు సంజీవ్, మాజిద్, బానేష్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

ఏసీసీ, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్ల కోసం 733 మంది అధికారులు, 6 స్పెషల్ పార్టీలు, 2 ప్లాటూన్‌ల కేంద్ర బలగాలతో భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మంచిర్యాలలో ఐజా ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద 5 ఏసీపీలు, 14 మంది సీఐలు, 40 మంది ఎస్‌ఐలు, 112 మంది ఏఎస్‌లు, హెడ్‌కానిస్టేబుళ్లు, 96 మంది కానిస్టేబుళ్లు, 21 మంది వుమెన్ కానిస్టేబుళ్లు, 80 మంది హోంగార్డులు మొత్తం 368 మంది సిబ్బందితో పాటు మూడు స్పెషల్ పార్టీలు, ఒక ప్లాటూన్ కేంద్ర బలగాల సిబ్బందితో భద్రత ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు గుంపులుగా ఉండరాదని, బాణాసంచ కాల్చవద్దని, కౌంటింగ్ కేంద్రం ప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. విజయోత్సవ ర్యాలీలు చేపట్టవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రంలో ప్రతీకార పాలన నడుస్తోంది



మాట్లాడుతున్న బాల్క సుమన్

ఏసీసీ, జూన్ 3: రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కాకుండా ప్రతీకార పాలన నడుస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో దాడికి గురైన బీఆర్ఎస్ నాయకుడు గడప రాకేష్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావులతో కలిసి పరామర్శించారు. వారు మాట్లాడుతూ గుండ రాజ్యం మంచిది కాదన్నారు. తాము అధికారంలో ఉన్న తొమ్మిదిన్న రేండ్లు ఏనాడు హత్య రాజకీయాలకు పాల్పడలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, మంత్రులను విమర్శించినా స్పోర్టివ్‌గా తీసుకున్నామే కానీ వ్యక్తిగతంగా కక్షలు పెంచుకోలేదన్నారు. రాకేష్‌ను చంపడానికి ప్రయత్నించారని, రాకేష్‌పై దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాల మీద హత్యా నేరం నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రేంసాగర్‌రావు రాకేష్ సంగతి చెబుతానని హెచ్చ రించాడని గుర్తు చేశారు. దాడికి పాల్పడిన వారిపై విచారణ సజావుగా జరగాలని డిమాండ్ చేశారు. దాడి దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రేంసాగర్‌రావు గెలిచాక నియోజకవర్గంలో రౌడీయిజం, భూకబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పట్టణా ధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో 12 స్థానాల్లో గెలుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 12 స్థానాల్లో విజయం సాధిస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇండియా కూటమికి విజయావకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో తన తనయుడు వంశీ భారీ మెజార్టీతో గెలుస్తాడన్నారు. ప్రజల సంక్షేమం దిశగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి మాజీ సీఎం కేసీఆర్ అవినీతిమయం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంగ్రెస్ నాయకులు దుర్గం నరేష్, సమ్మయ్య, గుడ్ల రమేష్, సంగి సంతోష్, నర్సిం గ్, భూమయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ ణంలోని రెండో జోన్‌కు చెందిన కాంగ్రెస్ నాయ కుడు, ఆటో డ్రైవర్ కలీమ్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టెంట్‌హౌజ్ నిర్వాహకుడు అంజయ్య కుమారుడు శ్యాంసుందర్ సోమవారం మృతిచెందగా ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యు లను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు దుర్గం రమేష్, గుడ్ల రమేష్, అర్జున్‌కుమార్, కిరణ్ , నర్సింగ్, ఖాజా పాల్గొన్నారు.

ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు



భీమిని, జూన్ 3 : ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు జన్మించిన సంఘటన మండలంలోని పెద్దపేట గ్రామ పరిధిలోని చెన్నపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన టాకెర శ్యాంరావు మేక ఒకే ఈతలో ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. అన్ని ఆరోగ్యంగా ఉన్నట్లు శ్యాంరావు తెలిపారు. మేక పిల్లలను చూసేందుకు గ్రామస్థులు శ్యాంరావు ఇంటికి చేరుకున్నారు. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని పశువైద్యాధికారి సందీప్ తెలిపారు.

ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయవద్దు



మాట్లాడుతున్న కౌన్సిలర్ మిన్హాజోద్దీన్

ఏసీసీ, జూన్ 3: పట్టణంలోని ఉమర్ మియా హౌజింగ్ సొసైటీ సభ్యులకు ఇంటి నిర్మాణానికి మున్సిపాలిటీ అనుమతులు మంజూరు చేయవద్దని 25వ వార్డు కౌన్సిలర్ మిన్హాజోద్దీన్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమర్ మియా సొసైటీ కార్యనిర్వాహక వర్గం 2016 రద్దు అయ్యిందన్నారు. ఎన్నికలు జరగనందున స్పెషల్ ఆఫీసర్ జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఆధీనంలో సొసైటీ ఉందన్నారు. సొసైటీ సభ్యుల మంటూ కొందరు ప్రెస్‌మీట్ పెట్టి అవాస్తవాలు చెప్పారని ఆరోపించారు. ఉమర్‌మియా సొసైటీ సభ్యులు ఇంటి అనుమతులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకుంటే కమిషనర్ తిరస్కరించినందున హైకోర్టును ఆశ్రయించారన్నారు. హైకోర్టు అనుమతుల విషయాన్ని చట్ట ప్రకారం పరిశీలించాలని అధికారులను ఆదేశించిందన్నారు. గర్మిళ్ల శివారులోని 474, 476లో టైటిల్ డాక్యుమెంట్లు ఉన్న వ్యక్తుల అభ్యంతరాలపై ఇంటి నిర్మాణానికి అను మతులు జారీ చేయడానికి ముందే సమగ్ర విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. సొసైటీ సభ్యులు హైకోర్టు యాజ మాన్య హక్కులను నిర్ధారించినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకా రం టైటిల్ డాక్యు మెంట్లు కలిగి ఉన్న వ్యక్తుల ఆక్షేపణలను పరిగణలోకి తీసుకుని అనుమతుల విషయం నిర్ణయించాలని ఆదేశిం చిందన్నారు. అసలు పట్టాదారులు అమీద్ వారసుడు అసదుల్లాకు అనుకూలంగా లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 2002లోనే ఇచ్చిం దన్నారు. అమీద్ వారసుల నుంచి భూమి కొను గోలు చేసిన వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు.

బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న బాల్క సుమన్

నస్పూర్, జూన్ 3 : నస్పూర్‌లోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జిల్లా కార్యాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, బాల్క సుమన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఏర్పాటుకు ముందున్న పరిస్థితులు, తరువాత వివిధ అంశాలపై లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, నాయకులు విజిత్ రావు, అక్కూరి సుబ్బయ్య, వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కన్నుల పండువలా సీతారాముల కల్యాణం

గొల్లపల్లి, జూన్ 3: గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లె గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సోమవారం కన్నులపండువలా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొమ్మెన మాధవి -కుమార్, ధర్మకర్త చింతపంటి శశికళ-తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కల్యా ణ మహోత్సవంను వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు గో వర్ధన నరసయ్య, సాయికృష్ణఆచార్యుల వేధమంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన సెక్రెటరీగా సాయిచరణ్

బెల్లంపల్లి, జూన్ 3: జిల్లా కాంగ్రెస్ యువజన సెక్రెటరీగా బెల్లంపల్లికి చెందిన సాయిచరణ్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ సోమవారం జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్‌లు నియామకపత్రం అందించారు. రంజిత్, హరీష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఆదాయం రూ.1.51కోట్లు

మల్యాల, జూన్ 3: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గత నెల 30నుంచి ఈ నెల 1వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దేవస్థానానికి రూ.1,51,38,490ఆదాయం వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దీక్ష విరమణ టికెట్ల ద్వారా రూ.31,09,700, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.9,76,150, ప్రత్యేక దర్శనం రూ. 21,77,500, ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ. 76,42,000ల లడ్డూ విక్రయాలు, రూ.12,33,140ల పులిహోర విక్రయాలు జరిగినట్లు వివరించారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయినప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. గతేడాది దేవస్థానానికి హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా రూ.1.30,43,525 సమకూరగా ఈ సారి రూ.20,64,965 అధికంగా వచ్చినట్లు అయింది.

కాంగ్రెస్ నాయకుల పూజలు

చెన్నూరు, జూన్ 3: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ భారీ మెజార్టీతో గెలవాలని పట్టణంలోని అంబా అగస్త్రేశ్వర ఆలయంలో సోమవారం హేమవంతరెడ్డి-శకుంతల దంపతుల ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ విజయం ఖాయమని పేర్కొన్నారు. నాయకులు సూర్యనారాయణరెడ్డి, బుర్ర కృష్ణ, రాజేందర్, శ్రీనివాస్, కమలాకర్, రాంగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్లమెంట్ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ దేశంలో, రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలిచి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ భారీ మెజారిటీతో గెలుపొందాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. పల్లె రాజు, మహంకాళి శ్రీనివాస్, నీలం శ్రీనివాస్, గోషు రాజం, కనకరాజు, మోకనపల్లి రామకృష్ణ, పుల్లూరి కళ్యాణ్ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపడతాం



కల్వర్టును పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

ఏసీసీ, జూన్ 3: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల పట్టణంలో వర్షం నీటితో ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ మధుకర్‌లు అన్నారు. సోమవారం బృందావన కాలనీ, సీతారామకాలనీ, నాగదేవత కాలనీ, చున్నంబట్టి వాడలో వర్షం నీరు చేరకుండా ఉండడానికి మత్తడి కాలువ పూడిక తీత కల్వర్టు నిర్మాణం కోసం స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పూదరి సునీత ప్రభాకర్, ఏఈ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏసీసీ, జూన్ 3: మంచిర్యాల రైల్వేస్టేషన్ లో బెంగళూరు నుంచి పాట్నా వైపు వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (43) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. వాటర్ బాటిళ్లు ఏరుకునే వ్యక్తిగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, బ్లాక్ టీషర్టు, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. రైల్వే ఎస్ఐ సుధాకర్ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు సంబంధీకులు 8712658596లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

హాజీపూర్, జూన్ 3: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బొంద్ల సురేష్ మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన బొప్పొ అమృతరావు అనే వ్యక్తి రోడ్డు ఇవతల వైపు బైక్‌పై వస్తుండగా ప్రమాదం జరిగింది. అమృతరావు, సురేష్ తలలకు గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన అంబలి పంపిణీ

కాసిపేట, జూన్ 3: కోట్నీరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో రెండు నెలలుగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ అన్నారు. సోమవారం అంబలి ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రెండు నెలలుగా కంపెనీ కార్మికులు, ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీలు సత్యతి మల్లేష్, మడావి భీంరావు, మేరుగు పద్మశంకర్, కాంగ్రెస్ నాయకులు అన్నం కుమార్, రవీందర్, షౌకీర్, ఖదీర్, ఖలీం, వెంకటేష్, కనకరాజు, అనంతరావు, కొమ్ము బాపు, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.





వామ్మో జూన్



- ప్రారంభం కానున్న విద్యాసంస్థలు
- పెరిగిన పాఠశాలల ఫీజులు, పుస్తకాల ధరలు
- పేద మధ్య తరగతి కుటుంబాల్లో గుబులు



బెల్లంపల్లి, జూన్ 3: పేద, మధ్య తరగతి కుటుంబాల్లో జూన్ నెల దడ పుట్టిస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో తల్లిదండ్రులు చదువుల కోసం ఇంటి బడ్జెట్‌ను తయారు చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం కానుండడంతో రైతులు పంటలకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల ఫీజులు, పుస్తకాల ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు గతేడాది కంటే పెరిగాయి. ఒకే నెలలో పిల్లల చదువులు, పంటల పెట్టుబడుల ఖర్చులు ఉండడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వణుకు పుట్టిస్తోంది.

పెరిగిన పాఠశాలల ఫీజులు, పుస్తకాల ధరలు

యూకేజీ నుంచి ఎల్‌కేజీ స్థాయిలోనే పలు ప్రైవేటు పాఠశాలల్లో వేల రూపాయలు ఫీజులు చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటికి ప్రచారాన్ని పూర్తి చేశాయి. ప్రైవేటు పాఠశాలల్లో గతేడాది 1వ తరగతికి రూ.12 వేల నుంచి 14 వేలు వరకు ఉండగా ప్రస్తుతం రూ.16 నుంచి 20 వేలు చెబుతున్నారు. తరగతి పెరిగిన కొద్ది రూ.5 వేల నుంచి 8 వేల వరకు ప్రైవేటు పాఠశాలల ఫీజులను పెంచేశారు. పాఠశాలల ఫీజు లే కాకుండా ట్యూషన్ ఫీజు, పరీక్ష ఫీజు, బస్ ఫీజులు అంటూ అదనంగా ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. వీటికి తోడు పుస్తకాలు, బ్యాగుల ధరలు, యూనిఫాం ధరలు ఈ యేడాది 20 శాతం పెరిగినట్లు వ్యాపారులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

రైతుల నెత్తిన పెట్టుబడి భారం

రైతులు పంట పెట్టుబడి కోసం సిద్ధమవుతారు. ఇప్పటి నుంచే పంటకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేస్తున్నారు. భూమిని దున్నడానికి ట్రాక్టర్లు గతేడాది గంటకు వెయ్యి రూపాయలు తీసుకోగా ప్రస్తుతం రూ.1300, డిమాండును బట్టి రూ.1500 తీసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు 40 శాతం పెరిగాయని ఎరువుల దుకాణాల వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఒక్క కుటుంబంపై లక్షల్లో భారం....

జిల్లాలో ఒక్కో కుటుంబంపై లక్షల రూపాయల భారం పడనుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు, చిరు వ్యాపారుల కుటుంబాలు పిల్లల చదువుల విషయంలో వెనకాడడం లేదు. ఉన్నతంగా చదవాలనే ఉద్దేశంతో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల వైపు అడుగులు వేస్తున్నారు. పాఠశాలల ఫీజులతో పాటు పుస్తకాలు, ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంతో సామాన్యుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

ఫారెస్ట్ బీట్ అధికారిపై దాడి



గాయపడిన బీట్ అధికారి సాయికుమార్

జన్నారం, జూన్ 3: కవ్వాల టైగర్ జోన్‌లోని తపాలాపూర్ చెక్‌పోస్ట్ వద్ద బీట్ అధికారిపై యువకులు దాడికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తాళ్లపేట వైపు నుంచి వస్తున్న కారును ఆపి బీట్ అధికారి అల్లం సాయికుమార్, వాచర్ శ్రీనివాస్‌లు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు కారులో ఉన్న వ్యక్తితో గొడవ పడ్డారు. మీరెందుకు గొడవ పడుతున్నారని బీట్ అధికారి ప్రశ్నించగా ద్విచక్ర వాహనంపై వచ్చిన శ్రావణ్‌కుమార్, తీగల ఉదయ్‌కుమార్‌లు మద్యం మత్తులో బీట్ అధికారి సాయికుమార్ తలపై దాడి చేశారు. వాచర్ శ్రీనివాస్ అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై కూడా దాడి చేశారు. గాయపడిన ఇద్దరిని లక్షెట్టిపేట ఆసుపత్రికి, అక్కడ నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎఫ్ఎస్ఓ రాజవర్ధన్ తెలిపారు. సోమవారం తాళ్లపేట రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, బీట్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

జన్నారం, జూన్ 3: మండలంలోని కలమడుగు గ్రామంలో ఆదివారం కురిసిన వర్షానికి రాజన్న అనే వ్యక్తి ఇంటి పైకప్పు లేచిపోవడంతో నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు జాన్సన్ నాయక్ బాధితున్ని పరామర్శించి ఓదార్చారు. రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, ఫజల్‌ఖాన్, జనార్దన్, రాజేశ్వర్, స్వదేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోతుల భయంతో పరుగు

- కిందపడిన ఓరియంట్ కార్మికుడు, చికిత్స పొందుతూ మృతి
- నష్టపరిహారం చెల్లించాలని కుటుంబీకుల ఆందోళన

కాసిపేట, జూన్ 3: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న మేకల రాజేష్ (45)పై కోతులు దాడి చేయగా కిందపడి తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం బి-షిఫ్టులో రాజేష్ విధులు నిర్వహిస్తుండగా కోతుల గుంపు దాడి చేశాయి. భయాందోళనకు గురైన రాజేష్ తప్పించుకునేందుకు పైనుంచి పడ్డాడు. దీంతో ఆతడి పక్కటెముకలు విరిగాయి. కంపెనీ డిస్పెన్సరీలో చికిత్స అందించిన అనంతరం మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాజేష్ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బెనిఫిట్స్ ఇవ్వాలని కార్మికులు, కుటుంబ సభ్యులు కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. కంపెనీ హెచ్ఆర్ జీఎం కులకర్ణి మాట్లాడుతూ రూ.10 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, టర్మినల్ బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, గిరిజన సంఘాల నాయకులు కొమ్ముల బాపు, ఆడె జంగు, మృతుని కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.



మేకల రాజేష్ (ఫైల్)

సమ్మర్ క్యాంపు ముగింపు



ముగింపు వేడుకల్లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్

రామకృష్ణాపూర్, జూన్ 3: పట్టణంలోని ఆల్ఫా పాఠశాలలో సమీక్ష ఆర్ట్స్ అకాడమీ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ రాజశేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న గురువులు, అకాడమీ డైరెక్టర్‌ను ఆయన అభినందించారు. అకాడమీ ఈవెంట్ ఫౌండర్ ఎర్రబెల్లి మెర్సిరాణి మాట్లాడుతూ శిబిరంలో 11 డిపార్ట్‌మెంట్లలో 100 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. పలు విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. కూచిపూడి మాస్టర్ మోహినోద్దీన్, జేసీఐ ట్రైనర్ సైకాలజిస్టు సుమన చైతన్య, యోగా మాస్టర్ శ్రీనివాస్, మాల కొండయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బీభత్సం : మూడు ద్విచక్రవాహనాలు ధ్వంసం

జైపూర్, జూన్ 3: మండలం లోని ఇందారం బస్టాండ్ వద్ద సోమవారం రాత్రి శ్రీరాంపూర్ వైపు నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో అతివేగంగా వచ్చి బస్టాండ్‌లోని వ్యాపార దుకాణం లోకి దూసుకువెళ్లింది. ఈ సంఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ట్రాలీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడిపాడని స్థానికులు తెలిపారు. సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.



ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తాం

బెల్లంపల్లి, జూన్ 3: యూరియా కలిసిన నీటిని తాగి గొర్రెలు మృతిచెందడం బాధాకరమని, బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి పేర్కొన్నారు. సోమవారం గొర్రెలు నష్టపోయిన కొమ్ము మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్యేకు ఫోన్‌లో వివరించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ జాడి మహేష్, నాయకులు శ్రీనివాస్, మల్లేష్, చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మందమర్రిటౌన్, జూన్ 3: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మదిరె శ్యాంసుందర్ (30) అనే యువకుడు సోమవారం బాత్రూంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ఎంతకు బయటకు రాకపోవడంతో తలుపు పగులగొట్టి చూడగా బాత్రూంలో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్ మృతదేహాన్ని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్నాడా, సహజ మరణమా అని పోస్టుమార్టం నివేదికలో తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు

జైపూర్, జూన్ 3: మండలంలో ఆదివారం గాలివాన బీభత్సానికి విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. దీంతో రాత్రంతా మండలంలో విద్యుత్‌సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. విద్యుత్‌శాఖ ఏడీఈ రాజేశ్వర్, ఏఈ అంజలీకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి విద్యుత్‌పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. మండలంలోని ఎల్కపల్లి, చిన్ననిడ్డాపూర్ తదితర గ్రామాల్లో సుమారు 20కిపైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్రఅంతరాయం కలిగింది. విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి వేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో మండలప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



రాత్రి పనులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

ప్రాణహితలో మునిగి ఒకరు మృతి



ప్రాణహిత నదిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు

దహెగాం, జూన్ 3: మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన కుడ్మెత గోవిందరావు(45) ప్రాణహితలో మునిగి మృతిచెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం గోవిందరావు కుటుంబసభ్యులతో కలిసి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో గల తోగు వెంకటాపూర్‌లోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్తున్నట్లు కుటుంబసభ్యులకు తెలియజేసి బయలుదేరాడు. కాగా కుటుంబసభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా గోవిందరావు కనిపించలేదు. అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు తెలిసిన వారి ఇళ్లలో వాకబు చేశారు. ఫలితం లేకుండా పోయింది. కాగా సోమవారం ఉదయం గోవిందరావు ప్రాణహితనదిలో శవమై తేలాడు. ఈమేరకు మృతుడి భార్య కుసుమాంజలి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాగజ్‌నగర్ నుంచి వెళ్లిన ఎన్నికల ఏజెంట్లు

కాగజ్‌నగర్, జూన్ 3: ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగే ఎంపీ ఎన్నికల ఫలితాల కోసం బీజేపీ తరఫున ఏజెంట్లు కాగజ్‌నగర్ నుంచి సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు ఏజెంట్లను వివిధవాహనాల్లో ఆదిలాబాద్‌కు పంపించారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

కాగజ్‌నగర్, జూన్ 3: కాగజ్‌నగర్ మండలం కడంబా-కాగజ్‌నగర్ మధ్య నడిచే ఆర్టీసీ బస్సులో సోమవారం చోరీ జరిగినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం బస్టాప్ వద్ద ఎక్కిన ప్రయాణికురాలు సుజాతబ్యాగ్‌లో ఉన్నతులాల బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు వివరించారు. ఈ మేరకు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి

● అక్కడే తచ్చాడిన ఇతర ఆవులు

కాగజ్‌నగర్, జూన్ 3: కాగజ్‌నగర్-ఆసిఫాబాద్ ప్రధానరహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక ఆవు మృతిచెందింది. ఆవులు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఆవును ఢీకొంది. దీంతో ఆవుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. బైక్‌పైన ఉన్న వ్యక్తికి కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. కాగా అక్కడే ఉన్న మిగతా ఆవులు మృతిచెందిన ఆవు వద్దకుచేరి తలతో తాకుతూ రోదించడం అందరి హృదయాలను కలిచి వేసింది.



మృతిచెందిన ఆవు, (ఇన్‌సెట్లో) రోదిస్తున్న ఆవు

నేటి తరానికి ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 3: నేటి తరానికి ఛత్రపతి శివాజీ ఆదర్శ ప్రాయుడని ఆరె సంక్షేమసంఘం జిల్లాఅధ్యక్షుడు జయరాం అన్నారు. మండలంలోని ఐటిక్యాల గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, మాజీఎంపీపీ బాలేష్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, బీసీసంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మారుతిపటేల్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరెకులంలో ప్రతిఒక్కరూ విద్యావంతులు కావడానికి అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఆరె కులాన్ని ఓబీసీలో చేర్చాలని కోరారు. నేటితరానికి శివాజీజీవితం ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, నాయకులు కమలాకర్, నాగయ్య, మారుతి, సంతోష్, చిత్రు, విఠల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్ల చిత్రాలు..



బ్యాలెట్ ఓట్లు లెక్కింపునకు సిద్ధం చేసిన కౌంటింగ్‌హాల్



కౌంటింగ్‌హాల్‌లో ఎన్నికల సిబ్బంది



బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది



సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



సాయి చరణ్



షేక్ ఖాజాబాబా



నాగప్రణీత

కాగజ్‌నగర్, జూన్ 3: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో కాగజ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సిందం సాయిచరణ్‌కు ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 29వర్యాంకు, షేక్‌ఖాజాబాబా ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో 104వ ర్యాంకు, నాగప్రణీతకు ఎంపీసీ విభాగంలో 714ర్యాంకు సాధించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ప్రీకోచింగ్‌లో ఇంజనీరింగ్ విభాగంలో 19, మెడికల్ విభాగంలో 17మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు జిల్లా సైన్స్ అధికారి మధుకర్ తెలిపారు.





ఉత్కంఠ..!

- నేడే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు
- ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ
- జోరుగా సాగుతున్న బెట్టింగ్‌లు, చాలెంజ్‌లు
- తాజా ఎగ్జిట్ పోల్స్ ఫలితాల పై సర్వత్రా చర్చ
- కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఆసిఫాబాద్ సెగ్మెంట్‌లో 16, సిర్పూర్ సెగ్మెంట్‌లో 14 టేబుళ్లు
- 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

ఆదిలాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు ఎవరిదనేది సర్వత్ర ఉత్కంఠగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు ఆరాట పడుతుండగా బీజేపీ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు ధీమాతో కనిపిస్తోంది. బీఆర్ఎస్ గెలిచి తీరాలనే పట్టుతో ఉంది. లోక్‌సభ ఎన్నికల బరిలో మొత్తం 12మంది అభ్యర్థులు ఉన్న అదృష్టం ఎవరిని వరిస్తుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలవారీగా వేరువేరు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 16లక్షల 50వేల 175 ఓటర్లు కాగా 12లక్షల 21వేల 563 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 74.03 శాతం పోలింగ్ నమోదైనట్లు అధి కారులు వెల్లడించారు. మొత్తం 23రౌండ్లతో తుదిఫలితం తేలిపోనుంది. ఇన్నాళ్లు అభ్యర్థులు పార్టీ నేతలు వేసిన అంచనాలు ఏమేరకు నిజమవుతాయో మరికొన్ని గంటల్లోనే తెలిసిపోనుం ది. ప్రధానపార్టీల అభ్యర్థులు గోడం నగేష్, ఆత్రంసక్కు, ఆత్రంసుగుణ గెలుపుపై ధీమాతోనే కనిపిస్తున్నారు. ఆదివాసీల మద్ధతుతో గెలిచే అవకాశాలు తమకే మెరుగుగా ఉన్నాయని ముగ్గురు అభ్యర్థులు చెబుతున్నా చివరకు వారి మద్ధతు ఎవరికన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఈసారి ఆదిలాబాద్ స్థానం నుంచి గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టే ఎంపీ ఎవరన్నదే హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే కొన్ని వార్త సంస్థలు, ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేయడంతో సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

అభ్యర్థుల్లో హైటెన్షన్..

కౌంటింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్ది ప్రధానపార్టీల అభ్యర్థుల్లో హైటెన్షన్ కనిపిస్తోంది. మంగళవారం ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభంకానుంది. సుమారుగా 10-15రౌండ్లు పూర్తికాగానే ఎవరు గెలుస్తారన్నది దాదాపుగా తేలిపోనుంది. మద్ధతుగా నిలిచే నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు అభ్యర్థులు గెలుపు పై ఆశలు పెట్టుకుంటున్నారు. ఒకవేళ అంచనాలు తారుమారైతే కౌంటింగ్ కేంద్రాన్ని వదిలివెళ్లే అవకాశాలు లేకపోలేదు. త్రిముఖ పోటీలో నువ్వానేనా అన్న ట్లుగా ఫలితాలు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయినా తుది ఫలితాలు వెల్లడైతేనే ఎవరు గెలిచేది స్పష్టంకానుంది. వివిధ రకాలుగా వినిపిస్తున్న ఊహాగానాలతో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నా రు. ఇన్నాళ్లు అభ్యర్థులు, పార్టీ నేతలు వేసిన అంచనాలకు లెక్క కుదురు తుందో లేదో తెలియాలంటే మరికొన్ని గంటలు వేచి చూడాల్సిందే. పోస్టల్ బ్యాలెట్ ఫలితాల ఆధారంగా అభ్యర్థుల గెలుపును అంచనా వేయవచ్చుననే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అంతటా అదే చర్చ..

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్ది రాజకీయ వర్గాల్లో బెట్టింగ్‌లు, చాలెంజింగ్ జోరు కనిపిస్తోంది. అభ్యర్థుల గెలుపు పై ఎవరికి వారే అంచనాలు వేసుకుంటూ బెట్టింగ్‌లకు దిగుతు న్నారు. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అంతటా పార్లమెంట్ ఫలితాల పైననే చర్చించుకోవడం కనిపిస్తోంది. అభ్యర్థుల గెలుపోటములు ఎలా ఉన్నా ఫలితం కోసం అభిమాన కార్యకర్తలు, రాజకీయవర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. తమకున్న రాజకీయ పరిజ్ఞానంతో పక్కాగా తమ అభ్యర్థే గెలుస్తాడని బలంగా చెబుతున్నారు. కాదు కూడదంటే బెట్టింగ్‌లు కట్టేందుకు సిద్ధమవుతున్నారు. వందల రూపాయల నుంచి వేలు, లక్షల్లో బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తూనే ఉంది. లోక్‌సభ ఫలితాలతో మునిగేదెవరో, తేలేదెవరో మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. పార్లమెంట్ పరిధిలో ఏ నలుగురు కలిసినా లోక్‌సభ కౌంటింగ్ పైననే చర్చించుకోవడం కనిపిస్తోంది.

మొదలైన కౌంట్‌డౌన్..

లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. మంగళవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా చేపట్టేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిచేశారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి తుదివిడత శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫలితాలను సకాలంలో వెల్లడించేందుకు మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ప్రత్యేకంగా రిటర్నింగ్, అబ్జర్వర్‌లను నియమించారు. మొత్తం 108మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించగా సూపర్‌వైజర్లు 36మంది, కౌంటింగ్ అసిస్టెంట్ 36, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ 36మంది సిబ్బందిని నియమించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు మొత్తం 68మంది సిబ్బందిని నియమించగా సూపర్‌వైజర్లు 17 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 34మంది, మైక్రో అబ్జర్వర్స్ 17మందిని నియమించారు. ఒక్కో నియోజకవర్గంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు నలుగురు సూపర్‌వైజర్లు, ఇద్దరు కౌంటింగ్ సిబ్బంది, మరో ఇద్దరు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. కౌంటింగ్‌కు వచ్చే అధికారులు, రాజకీయ పార్టీల నేతల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించరాదనే నిబంధనను అమలు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే ముందు ప్రతిఒక్కరిని క్షుణంగా పరిశీలించిన అనంతరమే లోనికి పంపనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్‌ను విధించారు. సోమవారం కౌంటింగ్ కేంద్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజార్షిషా పరిశీలించారు.

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం..

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మంగళవా రం వెల్లడికానున్నాయి. హోరాహోరీగా జరిగిన ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ప్రస్తుతం స్ట్రాంగ్‌రూంలో భద్రంగా ఉన్న ఈవీఎంలను తెరిచి మంగళవారం ఉదయం నుంచి లెక్కించబోతున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజక వర్గాలు ఉండగా ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు శాసనసభ నియోజక వర్గాల ఫలితాలను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో లెక్కించనున్నారు.

ఆసిఫాబాద్, సిర్పూరు నియోజక వర్గాల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 23రౌండ్లపాటు జరుగనున్న కౌంటింగ్‌లో ఆసిఫాబాద్ నియోజక వర్గంలో 16, సిర్పూర్ నియోజకవర్గంలో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కోసం మరోమూడు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్, సీలింగ్, రిజర్వ్ సిబ్బందితో కలుపుకొని మొత్తం 300 మంది సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన నున్నారు. అలాగే ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎప్పటి కప్పుడు లెక్కింపు మదింపు వేసి రౌండ్లవారీగా ఫలితాలను వెల్లడిస్తారు.

ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 356 పోలింగ్ బూత్‌లకుగాను 23 రౌండ్ల పాటు ఓట్ల లెక్కింపు జరుగనుండా సిర్పూరు నియోజక వర్గానికి సంబంధించిన 320 పోలింగ్‌బూత్‌ల ఓట్లను 23 రౌండ్లలో పూర్తి చేయనున్నారు. లెక్కింపు కేంద్రంలో సిబ్బంది, పార్టీ అభ్యర్థుల ఏజెంట్లు, ఫలితాల వెల్లడి కోసం అనుసరించనున్న వ్యూహాలపై జిల్లా ఎన్నికల అధికారి, పరిశీలకుల నేతృత్వంలో ఇదివరకే సమన్వయ సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడటం కోసం ఒకటికిరెండు సార్లు రిహార్సల్స్ చేయనున్నారు. ఉదయం 8గంటల నుంచి ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది గంటముందు గానే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. మీడియాను కూడా ఉదయం 7 గంటల నుంచి కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఫలితాల వెల్లడి కోసం ప్రత్యేకంగా మీడియాసెంటర్ ఏర్పాటు చేసి పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా రౌండ్ల వారీ ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రకటించనున్నారు.

పార్లమెంట్ పరిధిలో నియోజక వర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
1. సిర్పూర్(01)	114522	114567	12	229101
2. ఆసిఫాబాద్(05)	112788	114404	16	227208
3. ఖానాపూర్ (06)	109685	114825	13	224523
4. ఆదిలాబాద్ (07)	119848	125283	06	245137
5. బోథ్ (08)	102458	108852	03	211313
6. నిర్మల్ (09)	121991	136304	19	258314
7. ముథోల్(010)	123583	130978	18	254579
మొత్తం	804875	845213	87	1650175

నియోజక వర్గాల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు..

నియోజక వర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు	లెక్కింపు ఓట్లు
సిర్పూర్	320	23	163944
ఆసిఫాబాద్	356	26	171511
బోథ్	306	22	165157
ఆదిలాబాద్	292	21	181136
ఖానాపూర్	309	22	162101
నిర్మల్	306	22	185168
ముథోల్	311	23	192546

పార్లమెంట్ పరిధిలో నియోజక వర్గాల వారీగా పోలైన ఓట్ల వివరాలు..

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	83471	80465	08	163944
ఆసిఫాబాద్	87090	84417	04	171511
బోథ్	82094	83062	01	165157
ఆదిలాబాద్	90858	90272	06	181136
ఖానాపూర్	76926	85171	04	162101
నిర్మల్	84674	100484	10	185168
ముథోల్	93995	98549	02	192546
మొత్తం	599108	622420	35	1221563

ఫలితాలపై ఆసక్తి..

మరికొన్ని గంటల్లో కౌంటింగ్ ప్రారంభం కానుం డటంతో జిల్లా వ్యాప్తంగా రెండు నియోజకవర్గ ఫలితాలపై ఆసక్తి పెరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యే పోరు కొనసాగగా అభ్యర్థుల గెలుపు ఓటములపై ఖచ్చితమైన నిర్ధారణకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ సరళిని బట్టి చూస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో సిర్పూర్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీకి పెద్ద ఎదురు దెబ్బ తలిగింది.

బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా హరీష్ బాబు గెలుపొందడంతో ఆ నియోజకవర్గంలో బీజేపీకి అనుకూల పరిస్థితులున్నాయి. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి గెలుపొంది నప్పటికి ఆ పార్టీనుంచి కొందరు ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరారు. దీంతోనియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో అనుకూల పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనప్పటికీ మంగళవారం ఫలితాలు వెల్లడికానుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్



ఆదిలాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆసిఫాబాద్ జిల్లా కౌంటింగ్ కేంద్రం



కౌంటింగ్ హాల్ వద్ద విధులు నిర్వహించే పోలీసులు

బాధితులు దరఖాస్తు చేసుకోవాలి

బెజ్జూరు, జూన్ 3: మండలంలో ఆదివారం గాలివాన బీభత్సానికి పలుగ్రామాల్లో ఇంటిగోడలు కూలిపోయిన, ఆస్తినష్టం జరిగిన బాధితులు తహసీల్దార్ కార్యాలయంలో ఫొటోలు, ఆధార్, పూర్తి వివరాలతో దర ఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. గ్రామాల్లో ఇంటిపై కప్పు రేకులు, ఇంటి గోడలు కూలిన వాటికి సంబంధించిన ఫొటోలతో సహా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్పూర్(యు), జూన్ 3: మండలంలోని మహాగాంలో ఇటీవల మేస్రం తానుపటేల్ మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ గోడం నగేష్ సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా తానుపటేల్ మృతికిగల కారణాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా జైనూరు మార్కెట్ కమిటీ మాజీ చెర్మన్ ఆత్రం భగ్వంత్‌రావ్, మాజీ ఎంపీపీ కనకతుకారాం, మాజీసర్పంచ్ అర్క నాగోరావ్ మడావి బొజ్జిరావ్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల హామీల అమలుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్, జూన్ 3: గుర్తింపుసంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. ఆర్కే7 గనిపై సోమవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లా డారు. ఇంటినిర్మాణానికి గతంలో కార్మికులు తీసుకున్న రుణాలకు పెరిగి న వడ్డీ 8.3శాతం ఇచ్చేందుకు యాజమాన్యాన్ని ఒప్పించినట్లు చెప్పారు. పైరవీలకు తావులేకుండా సీఎంపీఎఫ్ రుణం దరఖాస్తున్న చేసుకున్న వారికి 10నెలలుగా లోన్ రావడం లేదన్నారు. వాటిని ఇచ్చేలా ఒప్పందం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏరియా కార్యదర్శి మారేపల్లి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

మందమర్రిటౌన్, జూన్ 3: సింగరేణిలో ప్రమాదాల నివారణకు యాజమాన్యం పకడ్బందీచర్యలు చేపట్టాలని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లిసమ్మయ్య, ఏరియాఉపాధ్యక్షుడు దేవిభూమయ్య అన్నారు. సోమవారం మందమర్రిలో వారు మాట్లాడుతూ కార్మికులు ప్రమాదంలో మృతిచెందితే కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉంటోందన్నారు. కార్మికులు ప్రమాదాల బారినపడకుండా తగినచర్యలు తీసుకోవాలన్నారు. గుర్తింపుపత్రం యాజమాన్యం వెంటనే అందించాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్‌దే

- ఎమ్మెల్సీ దండె విఠల్

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 3: రాష్ట్ర ప్రజల జీవితకాల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని బీఆర్ఎస్ నాయకులు, ఉమ్మడిజిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్సీ కోవ లక్ష్మి పునరుద్ఘాటించారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ భవనంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రఆవిర్భావ ముగింపు వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే రాష్ట్రఅభివృద్ధి సాధ్యమైందన్నారు. రాష్ట్రప్రజలకోసం కేసీఆర్ తన ప్రాణాలు సైతం వదులకోవడానికి సిద్ధపడ్డ చరిత్ర మరవకూడ దన్నారు. ప్రస్తుత కాంగ్రె స్‌పాలనలో కరెంటు కష్టాలు తిరిగి ప్రారంభ మయ్యాయని ఆరోపించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, జడ్పీటీసీ ధ్రుప తాబాయి, అజయ్, ఎంపీపీలు సౌందర్య, మోతీరాం, శ్రీదేవ, మాజీసర్పంచ్‌లు బాబురావు, భీమేష్, రవీందర్, లాల, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మోడల్ స్కూల్‌లో 6వతరగతిలో ప్రవేశానికి ఎంపిక జాబితా విడుదల

ఆసిఫాబాద్, జూన్ 3: జిల్లాకేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6వతరగతిలో ప్రవేశానికి సంబంధించిన ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఏప్రిల్7న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం మొత్తం 100మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికజాబితా పాఠశాల నోటీసుబోర్డులో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల5నుంచి 7వరకు ఒర్జినల్ టీసీ, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, రెండుసెట్ల జిరాక్స్ కాపీలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు. నిర్ణీతసమయంలో హాజరుకాని విద్యార్థుల అడ్మిషన్ రద్దవుతుందని తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన అధికారి

జైనూర్, జూన్ 3: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి మనోహర్ సోమవారం మండలంలోని ఉషేగాం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రబలుతున్న వ్యాధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ మరికొద్దిరోజుల్లో వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలుషిత నీటితో ప్రజలురోగాల బారిన పడే అవకాశం ఉందని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యాధులు ప్రబలిన వెంటనే తగిన వైద్యం అందించి వాటిని అదుపులోకి తీసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిరాజు, హెల్త్‌సూపర్‌వైజర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ఆసిఫాబాద్, జూన్ 3: ఆసిఫాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే కుడ్మెత జలపతిరావు గత సంవత్సరం సెప్టెంబరులో గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు కార్పస్, విడో ఫండ్ కిందరూ.60వేలచెక్కును సోమవారం ఎస్పీ సురేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు, సిబ్బంది.. ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసుకుటుంబాలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారి కుటుంబ సంక్షేమానికి కృషిచేస్తామని అన్నారు. వారి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్ అన్నీకూడా త్వరగా వచ్చేందుకు కృషిచేయాలని ఏవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఏవోశ్రీనివాస్, జిల్లా పోలీసుసంఘం అధ్యక్షుడు విజయశంకర్ తదితరులు ఉన్నారు.



హెడ్‌కానిస్టేబుల్ జలపతిరావు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు తొలగింపు

సిర్పూర్(టి), జూన్ 3: సిర్పూర్(టి) మండలం పెద్దబండవద్ద సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ఆదివారం ఈదురుగాలుల బీభత్సానికి భారీవృక్షం నేల కూలింది. దీంతో సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్ స్పందించి చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.



ఎక్స్‌కావేటర్‌తో వృక్షాన్ని తొలగింపజేస్తున్న ఎస్సై

త్వరితగతిన వంతెన పనులు పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

పెంచికలపేట, జూన్ 3: మండలం లోని ఎర్రగుంట ఉచ్చమల్ల వాగుపై నిర్మిస్తున్న లోలెవల్ వంతెన పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని అన్నారు. పనులునాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తిచేయాలన్నారు. అనంతరం మొట్లగూడ గ్రామంలో ఇటీవలవడదెబ్బతో మృతిచెందిన రైతు చౌదరి మహేష్ కుటుంబ సభ్యులతోపాటు గుంట్లపేట గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ దాసరి చంద్రమౌళి కుమారుడు జీవన్‌కుమార్ కిడ్నీ వ్యాధితో మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనవెంట నాయకులు మహేష్, పెంటయ్య, కాంతారావు, మహేష్, భాస్కర్, ప్రభాకర్, నగేష్ తదితరులు ఉన్నారు.

టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్, జూన్ 3: జిల్లాలో పదవతరగతి అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలకేంద్రాల్లో మూడు పరీక్షాకేంద్రాలను ఏర్పాట చేశారు. మొదటిరోజు తెలుగు పరీక్షకు 325మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 266మంది హాజరై పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను డీఈవో అశోక్, జిల్లా పరిక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు తనిఖీ చేశారు.

పిల్లర్స్ ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, జూన్ 3: కాగజ్‌నగర్ మండలం గోంది గ్రామశివారులోని అటవీశాఖ సరిహద్దు కంపార్టుమెంటు నెంబరు 68వద్ద గల నాలుగు పిల్లర్స్‌ను ధ్వంసం చేసిన గౌత్రే అర్జున్‌పై సోమవారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎఫ్ఆర్‌వో రమాదేవి తెలిపారు. ఈ మేరకు నిందితుడికి 11రోజుల పాటు రిమాండుకు తరలించినట్టు ఆమె వివరించారు.

చల్లబడిన వాతావరణం

చింతలమానేపల్లి, జూన్ 3: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇన్నిరోజులు ఎండలు దంచికొట్టడంతో ఉష్ణోగ్రతలు 40డిగ్రీల పైనే నమోదు అవుతుండడంతో ఉక్కపోతతో పాటు ఎండవేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సోమవారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడడంతో మండల ప్రజలు ఎండవేడి నుంచి ఉపశమనం పొందారు. కాగా వర్షాలు సకాలంలో కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు సాగుకోసం ముమ్మర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్ప టికే భూములను దున్నుకొని సిద్ధంగా ఉంచుకోగా విత్తనాలు, ఎరు వులు తీసుకొని అందుబాటులో ఉంచుకుంటున్నారు. వర్షాలు కురువగానే సాగుకు శ్రీకారం చుట్టనున్నారు.